సాక్షి
అన్నమయ్య జిల్లా

గురువారం । 23 । ఫిబ్రవరి । 2023



ఇద్దరు అంతర్‌రాష్ట్ర దొంగలు అరెస్ట్

మైదుకూరు సబ్ డివిజన్ పరిధిలోని బి..మఠం మండలం నందిపల్లి క్రాస్ వద్ద ఇద్దరు అంతర్ రాష్ట్ర దొంగలను అరెస్ట్ చేశారు. - 8లో



పెయ్యదూడల ఉత్పత్తి.. పాడిరైతుకు సంపత్తి

పెయ్య దూడల ఉత్పత్తికి ప్రాధాన్యత ఇచ్చి పాల దిగుబడులను గణనీయంగా పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.190	రూ.280
రెండోరకం	రూ.100	రూ.186



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 219 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	535	660
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 992.56 కిలోలు

పీఆర్‌కు సంపూర్ణ మద్దతు



సమావేశానికి హాజరైన వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్సీ అభ్యర్థి రామసుబ్బారెడ్డి

- కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పిలుపు
- శిల్పారామంలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో ప్రత్యేక సమావేశం

కడప కార్పొరేషన్: స్థానిక సంస్థల శాసనమండలి సభ్యునిగా వైఎస్సార్‌సీపీ తరుపున పోటీ చేస్తున్న పి. రామసుబ్బారెడ్డికి ప్రజాప్రతినిధులంతా సంపూర్ణ మద్దతు ఇవ్వాలని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం కడప రిమ్స్ సమీపం లోని శిల్పారామంలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ స్థానిక సంస్థల సమస్యలపై అవగాహన, అనుభవం ఉన్న నాయకుడు రామసుబ్బారెడ్డిని ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపిక చేసిన ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. వైఎస్సార్ సీపీ బీ ఫారంతో గెలిచిన ప్రతి ఒక్కరూ ఆయనకు మద్దతు ఇవ్వాలన్నారు. స్థానిక సంస్థల్లో ఉన్న సమస్యల పరిష్కారానికి రామసుబ్బారెడ్డి చిత్తశుద్ధితో కృషి చేస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు.

- జమ్మలమడుగు ఎమ్మెల్యే డా. సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశానుసారం అందరం సమష్టిగా కృషి చేసి రామసుబ్బారెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించాలని కోరారు. బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ మాట్లాడుతూ 2019 నుంచి ఏ ఎన్నికలు జరిగినా వైఎస్సార్‌సీపీ అఖండ మెజార్టీతో విజయం సాధిస్తూ వస్తోందని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా అదే పునరావృతం కావాలన్నారు. అనంతరం వారు రామసుబ్బారెడ్డిని సత్కరించారు.
- ఎమ్మెల్సీ సి. రామచంద్రయ్య, ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, ప్రభుత్వ సలహాదారు(ఉద్యానశాఖ) సంబటూరు ప్రసాద్‌రెడ్డి, సోషల్‌వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్ కుమార్, డిప్యూటీ మేయర్ బి. నిత్యానందరెడ్డి, ఏపీ పొల్యూషన్ బోర్డు సభ్యుడు పాకా సురేష్, మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కార్పొరేటర్లు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అణగారిన వర్గాలకు రాజ్యాధికారం

అణగారిన వర్గాలకు రాజ్యాధికారం కల్పించడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటున్నారని ఎమ్మెల్సీ అభ్యర్థి పి. రామసుబ్బారెడ్డి అన్నారు. జిల్లాలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు.

సామాజిక విప్లవానికి నాంది పలికారు

రాష్ట్రంలో సామాజిక విప్లవానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాంది పలికారని డిప్యూటీ సీఎం అంజద్‌బాషా అన్నారు. కేబినెట్ కూర్పు మొదలు కొని ఇప్పటి వరకూ అన్ని వర్గాలకు సమన్యాయం చేయడంలో ముఖ్యమంత్రి దేశంలోనే పేరెన్నికగన్నారన్నారు.

అన్ని వర్గాలకు పదవులు

అన్ని వర్గాలకు ఉన్నత పదవులు ఇచ్చి గౌరవించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె. సురేష్ బాబు అన్నారు. బీసీలకు సముచిత స్థానం కల్పించడంతో ముఖ్యమంత్రికి సదా రుణపడి ఉంటామన్నారు.

ఎన్నిక ఏకగ్రీవం అయ్యేలా బలపరచాలి

ఎమ్మెల్సీ ఎన్నిక ఏకగ్రీవం అయ్యేలా ప్రజా ప్రతినిధులంతా రామసుబ్బారెడ్డిని బలపరచాలని వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. స్థానిక సంస్థల్లో వైఎస్సార్‌సీపీకి మొదటి నుంచి తిరుగులేని మెజార్టీ ఉందన్నారు.

ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎన్నికల్లోనూ గెలిపించాలి

స్థానిక సంస్థల ఎన్నికలతోపాటు ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజవర్గాలకు జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి నిర్ణయాన్ని అన్నమయ్య, వైఎస్సార్ జిల్లాల్లోని వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులంతా గౌరవించి మద్దతివ్వాలన్నారు.

తెలివిగలవారెవరూ పోటీ పెట్టరు

జిల్లాలో తెలుగుదేశం పార్టీ, బీజేపీలకు నామమాత్రపు సంఖ్యాబలమే ఉందని, తెలివిగలవారెవరూ ఈ ఎన్నికల్లో పోటీ చేయబోరని కమలాపురం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. రామసుబ్బారెడ్డి అనుభవాన్ని గుర్తించి ఈ పదవి ఇవ్వడం సంతోషదాయకమన్నారు.

సీఎం వైఎస్ జగన్‌కు కానుక అందించాలి

స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా రామసుబ్బారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కానుక అందించాలని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. 2024లో కూడా సమష్టిగా కృషి చేసి వైఎస్సార్‌సీపీని మళ్లీ అధికారంలోకి తేవాలని కోరారు.

అట్టహాసంగా పొన్నపురెడ్డి నామినేషన్

వెంట వచ్చిన డిప్యూటీ సీఎం, మేయర్, ఎమ్మెల్యేలు

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి, మాజీ మంత్రి పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి నామినేషన్ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. బుధవారం కడప శిల్పారామంలో వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులతో సమావేశం అనంతరం కలెక్టరేట్‌కు చేరుకున్న రామసుబ్బారెడ్డి మధ్యాహ్నం 1.58 గంటలకు జిల్లా ఎన్నికల అధికారి సాయి కాంత్‌వర్మకు రెండు సెట్ల నామినేషన్ పత్రాలను అందజేశారు. ఆయన వెంట మైనార్టీ వర్గానికి చెందిన డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, బీసీ వర్గానికి చెందిన మేయర్ సురేష్ బాబు, ఎస్సీ వర్గానికి చెందిన డాక్టర్ దాసరి సుధ ఉన్నారు. నామినేషన్ అనంతరం రామసుబ్బారెడ్డి మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశానుసారం ఎమ్మెల్సీగా నామినేషన్ వేశానన్నారు. ముఖ్యమంత్రి నిర్ణయాన్ని గౌరవించి, తనను వైఎస్సార్‌సీపీ కుటుంబ సభ్యునిగా భావించి సహకరించిన ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజా ప్రతినిధులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలో టీడీపీ, బీజేపీ ప్రజాప్రతినిధుల సంఖ్యాబలం నామమాత్రంగా ఉన్నందున ఎన్నిక ఏకగ్రీవం అయ్యే అవకాశం ఉందని ఆయన ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. డిప్యూటీ సీఎం అంజద్‌బాషా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బడుగు, బలహీన వర్గాల ప్రజల చేయిపట్టుకొని రాజ్యాధికారం దిశగా ముందుకు తీసుకెళుతున్నారని తెలిపారు.



ఎన్నికల అధికారికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి పి. రామసుబ్బారెడ్డి

ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థులు..





అనంతపురం: ఎన్నికల రిటర్నింగ్ అధికారి కేతన్‌గార్గ్‌కు నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులు వెన్నపూస రవీంద్రారెడ్డి (పట్టభద్రుల స్థానం), ఎంవీ రామచంద్రారెడ్డి (ఉపాధ్యాయ), చిత్రంలో మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఉషశ్రీచరణ్, ఇతర ప్రజాప్రతినిధులు

న్యూస్‌రీల్

గంగమ్మ జాతరతో ఆర్టీసీకి రూ.13 లక్షల ఆదాయం

కడప కోటిరెడ్డిసర్కిల్: లక్కిరెడ్డిపల్లె మండలం అనంతపురం గంగమ్మజాతరకు కడప రీజియన్ నుంచి 45 ప్రత్యేక బస్సులను నడపగా రూ.13,11,932 ఆదాయం వచ్చిందని ఏపీఎస్ ఆర్టీసీ కడప రీజినల్ మేనేజరు గోపాల్‌రెడ్డి తెలిపారు.

హుండీ ఆదాయం రూ.16.81 లక్షలు



నగదును లెక్కిస్తున్న దృశ్యం

లక్కిరెడ్డిపల్లె : ఈ నెల 20, 21, 22 న జరి గిన మూడురోజుల గంగమ్మ జాతర సందర్భంగా ఆలయంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక, శాశ్వత హూండీలను లెక్కించగా రూ.16 లక్షల 81 వేల 7 వందలు ఆదాయం వచ్చినట్లు ఆలయ కమిటీ చైర్మన్ నరసింహారెడ్డి, ప్రత్యేకాధికారి రవీంద్రరాజులు పేర్కొన్నారు.

పటిష్టంగా ఎత్తిపోతల పథకాల నిర్వహణ

- పంపులకు మెష్ ఎత్తు పెంచుతాం
- వారంలో పీబీసీ విస్తరణ పనులపై పరిశీలన
- ఎస్ఈ రాజగోపాల్



బి.కొత్తకోట మండలం తరిగోడు ఎత్తిపోతలను పరిశీలిస్తున్న ఎస్ఈ రాజగోపాల్

బి.కొత్తకోట: ఏవీఆర్ హంద్రీనీవా పుంగనూరు ఉపకాలువపై నిర్మించిన ఎత్తిపోతల పథకాల నిర్వహణ పటిష్టంగా చేస్తామని ప్రాజెక్టు మదనపల్లె ఎస్ఈ సీఆర్.రాజగోపాల్ పేర్కొన్నారు. బుధవారం ఆయన బి.కొత్తకోట మండలంలోని తరిగోడు, గోళ్లపల్లె ఎత్తిపోతల పథకాలను పరిశీలించారు. వాటి నిర్వహణ, పని తీరును పరిశీలించి కాంట్రాక్టు సంస్థకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ తంబళ్లపల్లె నియోజకవర్గంలోని పెద్దతిప్పసముద్రం సమీపంలోని ఎత్తిపోతలు, కురబలకోట మండలం అంగళ్లు ఎత్తిపోతల పథకాలను కూడా పరిశీలించినట్టు చెప్పారు. సత్యసాయి జిల్లా నుంచి జిల్లాలోకి కృష్ణా జలాలను తరలిస్తామన్నారు. నీటి నిల్వ ఉన్నప్పుడు, ప్రవాహ సమయంలో ఎగువ ప్రాంతాల నుంచి ప్లాస్టిక్ వస్తువులు, చెత్త చెదారం, తేలియాడే వస్తువులు కొట్టుకు వస్తాయని, ఇవి కాలువపై నిర్మించిన పంపులకు అడ్డుపడి నీటి ఎత్తిపోతకు అడ్డంకిగా మారతాయన్నారు. దీనికోసం ఇప్పటికే పంపుల వద్ద నిర్మించిన మెష్‌ను మరింత ఎత్తుకు పెంచి ఏర్పాటు చేయాలని నిర్వహణ చేస్తున్న కాంట్రాక్ట్ సంస్థను ఆదేశించామన్నారు. పెద్దతిప్పసముద్రం, బి.కొత్తకోట, కురబకోట మండలాల్లో కాలువ గండ్లు పూడ్చివేత పనులు సాగుతున్నాయని చెప్పారు. జిల్లాలోని పెద్దతిప్పసముద్రం మండలం సీవీరామన్నగారిపల్లె నుంచి చిత్తూరు జిల్లా పెద్దపంజాణీ మండలం వరకు హంద్రీనీవా ప్రాజెక్టు పుంగనూరు ఉపకాలువ విస్తరణ పనులను రూ.1,217 కోట్లతో చేపట్టనున్నట్టు తెలిపారు. కాంట్రాక్టు సంస్థతో పనుల ఒప్పంద ప్రక్రియ పూర్తయిందని వచ్చేవారంలో సంస్థ ప్రతినిధులు కాలువను పరిశీలిస్తారని తెలిపారు. ప్రస్తుతం 380 క్యూసెక్కుల నీటి ప్రవాహం కలిగిన ఈ కాలువ సామర్థ్యాన్ని 1,180 క్యూసెక్కుల సామర్థ్యానికి పెంచనున్నట్లు పేర్కొన్నారు. ఈ పనులు పూర్తయ్యాక అన్నమయ్య, చిత్తూరు జిల్లాలకు కృష్ణా జలాలు పుష్కలంగా తరలిస్తామని వివరించారు. ఈ పరిశీలనలో ఆయన వెంట డీఈ త్రివేణి, కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులు ఉన్నారు.

అపూర్వం.. మహానైవేద్య ఘట్టం



మహానైవేద్యాన్ని కొల్లగొడుతున్న వడియ రాజులు



త్రినేత్రుడుగా (ఉగ్రరూపంలో) భక్తులకు దర్శనమిస్తున్న వీరభద్రస్వామి

హర హర మహాదేవ.. అంటూ భక్తుల శివ నామ స్మరణల మధ్య రాయచోటిలోని వీరభద్రస్వామి ఆలయంలో వేలాది భక్తుల సమక్షంలో మహానైవేద్య ఘట్టం కనుల పండువగా జరిగింది. వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో అత్యంత కీలకమైన ఘట్టం మహానైవేద్యం. ఈ దృశ్యాన్ని కళ్లారా చూడాలని తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి వేలాది భక్తులు రాయచోటికి తరలి వచ్చారు. సుండుపల్లె మండలం బింగివాండ్లపల్లె గ్రామానికి చెందిన వడియరాజులు తడి దుస్తులతో మడికట్టి అన్నం వండి సిద్ధం చేశారు. వేదపండితుడు నందుల మఠం శశిభూషణ్ సిద్ధాంతి ఆధ్వర్యంలో వీరభద్రస్వామికి (మూడవ కన్ను) త్రినేత్రం ధరింపచేశారు. ఆ సమయంలో కన్నడ భక్తుల విన్యాసాలు.. లింగాయత్తులు చేసిన హరహర మహాదేవ స్మరణల మధ్య ఈ అపూర్వ ఘట్టాన్ని భక్తులు వీక్షించారు.

–రాయచోటిటౌన్

పరిహారం పంపిణీ వేగవంతం చేయండి

జిల్లా కలెక్టర్ గిరీషా



సమీక్షా సమావేశంలో కలెక్టర్ గిరీషా

పీలేరు : జాతీయ రహదారి–71 విస్తరణ పనుల్లో భాగంగా మదనపల్లె – పీలేరు మధ్య భూములు కోల్పోయిన రైతులకు పరిహారం పంపిణీ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో మదనపల్లె – పీలేరు మధ్య భూసేకరణ, నష్టపరిహారం పంపిణీపై నేషనల్ హైవే అధికారులు, వీఆర్వోలతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదనపల్లె – పీలేరు మధ్య నాలుగులేన్ల రహదారి పూర్తయితే ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. పెండింగ్‌లో ఉన్న భూసేకరణ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. వేపులబైలు, బోడుమల్లువారిపల్లె, గూడరేవుపల్లె, పీలేరు గ్రామాలకు సంబంధించి భూసేకరణ పూర్తి చేసి నేషనల్ హైవే అధికారులకు అప్పగించాలని ఆదేశించారు. భూములు కోల్పోయిన వారికి ఇప్పటి 73 శాతం పరిహారం పూర్తయిందన్నారు. జగనన్న కాలనీల్లో ఇళ్లు కోల్పోయిన లబ్ధిదారులకు పరిహారం ఇవ్వడానికి ప్రతిపాదన చేయాలని హౌసింగ్ డీఈని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రవి, ఎస్‌హెచ్ డిప్యూటీ తహసీల్దార్ గురుప్రసాద్, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియలో అధికారులదే కీలక బాధ్యత

రాయచోటి: ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియలో సెక్టోరల్ అధికారులదే కీలక బాధ్యత అని జిల్లా అధికారులను కలెక్టర్ గిరీషా పీఎస్ ఆదేశించారు. జిల్లాలో జరుగుతున్న ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సన్నద్ధతపై కలెక్టర్ గిరీషా పీఎస్ జిల్లా నోడల్ అధికారులతో బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఎన్నికల నిర్వహణలో ఓటర్ల జాబితా తయారీ, ఎన్నికల సామగ్రి సేకరణ, పోలింగ్ కేంద్రాలలో సౌకర్యాలు, ఎన్నికలకు అవసరమైన సిబ్బంది, రవాణా, పోస్టల్ బ్యాలెట్ పత్రాల తయారీ, పోలింగ్ అధికారులకు శిక్షణ అత్యంత కీలకమన్నారు. పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్‌ను పక్కాగా ఏర్పాటు చేసుకోవాలని ఆయన స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా, డీఆర్‌ఓ సత్యనారాయణ, మదనపల్లి, రాయచోటి ఆర్డీఓలు మురళీ, రంగస్వామి, నోడల్ అధికారులు, సెక్టోరల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ముఖ గుర్తింపు ఆధారిత హాజరు తప్పనిసరి

జిల్లాలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో ముఖ గుర్తింపు ఆధారిత హాజరు వందశాతం అమలయ్యేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ గిరీషా పీఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం తాడేపల్లి నుంచి కార్యదర్శి ముత్యాలరాజు సీఎఫ్ఎంఎస్ అధికారి సునీల్ రెడ్డితో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో ముఖ గుర్తింపు ఆధారిత హాజరు అమలుపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి ముఖ గుర్తింపు ఆధారిత హాజరు తప్పనిసరి చేసిందన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

- ఎన్నికల కమిషన్ ఆదేశాలను తూ.చ. తప్పక పాటించాలి
- జిల్లాలో 76 పోలింగ్ కేంద్రాలు
- జిల్లాలో గ్రాడ్యుయేట్ ఓటర్లు 46,318 మంది, ఉపాధ్యాయ ఓటర్లు 3565 మంది
- 'సాక్షి'తో అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్



సాక్షి రాయచోటి: శాసనమండలి ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. గ్రాడ్యుయేట్, టీచర్లు, స్థానిక సంస్థలకు సంబంధించి ఎన్నికల ఏర్పాట్లలో అధికారులు సమన్వయంతో పనిచేయాలి. ప్రత్యేకంగా ఎన్నికల నిబంధనలు పాటించాల్సిన బాధ్యత అందరిపై ఉంది. ఎక్కడా కూడా ఎన్నికల కోడ్ ఉల్లంఘన జరగకుండా చర్యలు తీసుకున్నాం. ఇప్పటికే పోలింగ్ స్టేషన్ల గుర్తింపు మొదలుకొని ఇతర ఎన్నికల ప్రక్రియకు సంబంధించి అన్ని కార్యక్రమాలు సజావుగా జరుగుతున్నాయి. మార్చి 13వ తేదీన పోలింగ్‌కు సంబంధించిన అన్ని చర్యలు తీసుకుంటున్నాం,.. అని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ స్పష్టం చేశారు. ఆయన 'సాక్షి'తో మాట్లాడిన వివరాలు ఇలా..

కోడ్ ఉల్లంఘన జరగకుండా చర్యలు

జిల్లాలో మండలి ఎన్నికలకు సంబంధించి షెడ్యూల్ విడుదలైన నాటి నుంచి ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. ఈ కోడ్ ఎన్నికలు, కౌంటింగ్ పూర్తయ్యేవరకు అమలులో ఉంటుంది. ఎక్కడా కూడా కోడ్ ఉల్లంఘన జరగకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఎక్కడైనా ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు. అన్నమయ్య జిల్లాలో శాసనమండలి ఎన్నికలకు సంబంధించి మొత్తం 76 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశాం. పట్టభద్రులకు 44,, ఉపాధ్యాయులకు 32 పోలింగ్ కేంద్రాలు అవసరమని గుర్తించి ఆ మేరకు ఏర్పాటు చేశాం. చిన్నపాటి సమస్యలకు కూడా తావు లేకుండా వెబ్‌కాస్టింగ్ చేసేలా చర్యలు చేపడుతున్నాం. పోలింగ్ సిబ్బంది, ఇతర ఏర్పాట్లు తదితర అంశాలపై దృష్టి సారించాం.

మార్చి 13న పోలింగ్

కడప, అనంతపురం, కర్నూలు, చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు సంబంధించి పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ మార్చి 13వ తేదీన జరగనుంది. ఇందులో పట్టభద్రులైన 46,318 మంది ఓటర్లుగా నమోదు చేసుకున్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి సంబంధించి 3565 మంది ఉపాధ్యాయులు ఓటర్లుగా ఉన్నారు.

ఎప్పటికప్పుడు సమీక్షలు

జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నాం. ఇప్పటికే అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో కూడా సమావేశాలు నిర్వహించాం. కోడ్ ఉల్లంఘటనతోపాటు ఎన్నికల నిర్వహణ, అభ్యర్థుల ప్రచారాలు, ఇతర అనేక అంశాలపై ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్నాం.. అని కలెక్టర్ స్పష్టం చేశారు.

ప్రశాంత వాతావరణంలో ఎమ్మెల్సీ ఎన్నికలు

- నగదు, అక్రమ మద్యం అడ్డుకట్టకు చర్యలు
- చెక్‌పోస్టుల ద్వారా ఎప్పటికప్పుడు తనిఖీలు
- పోలింగ్ నిర్వహణకు భారీ పోలీసు బందోబస్తు
- సాక్షితో అన్నమయ్య జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు



సాక్షి ఇంటర్వ్యూ

సాక్షి రాయచోటి: అన్నమయ్య జిల్లాలో శాసనమండలి ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే పట్టభద్రులు, ఉపాధ్యాయ, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు నోటిఫికేషన్లతోపాటు నామినేషన్ల పర్వం కొనసాగుతోంది. ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహించడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నాం. ఇప్పటికే ఎనిమిది సర్కిళ్లతోపాటు 34 పోలింగ్ స్టేషన్ల పరిధిలో 12 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి అక్రమ మద్యం, నగదు రవాణా జరగకుండా నిఘా పెట్టాం.. అని అన్నమయ్య జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తెలిపారు. ఆయన సాక్షికి పలు వివరాలు వెల్లడించారు.

అక్రమ మద్యం, నగదు రవాణా అడ్డుకట్టకు చర్యలు

అన్నమయ్య జిల్లాలో పోలీసులు అప్రమత్తంగా పనిచేసేలా ప్రత్యేక చర్యలు చేపట్టాం. ఇప్పటికే అసాంఘిక కార్యకలాపాల నిరోధానికి ఫ్లైయింగ్ స్క్వాడ్‌తోపాటు ప్రత్యేక టీములను ఏర్పాటు చేశాం. అక్రమంగా మద్యం నిల్వలు, నగదుకు సంబంధించిన వ్యవహారాలపై దాడులకు బృందాలు పనిచేస్తాయి. అంతేకాకుండా ఎక్కడా ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా పటిష్ట చర్యలు తీసుకున్నాం.

చెక్‌పోస్టుల ద్వారా తనిఖీలు

అన్నమయ్య జిల్లాలో శాసన మండలి ఎన్నికల పోలింగ్ మార్చి 13న జరగనున్న నేపథ్యంలో ముందస్తు చర్యలకు ఉపక్రమించాం. ప్రధానంగా జిల్లాల సరిహద్దుల వద్ద, పట్టణాల్లో కూడా చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి ముమ్మర తనిఖీలు నిర్వహిస్తున్నాం. జిల్లాలో పోలింగ్ స్టేషన్ల పరంగా అవసరమైన బందోబస్తుతోపాటు 144 సెక్షన్, ఇతర చర్యలు చేపడుతున్నాం. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే అసాంఘిక శక్తుల ఏరివేతకు ప్రత్యేకంగా బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నాం. అలజడులు, అశాంతికి పాల్పడే వారిపట్ల అప్రమత్తంగా ఉండడంతోపాటు కఠినంగా వ్యవహరిస్తాం. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా ప్రజలతోపాటు అన్ని పార్టీలు, అధికారులు, ప్రజలు సహకరించాలి.

చట్ట వ్యతిరేకంగా వ్యవహరిస్తే కొరడా ఝుళిపిస్తాం

జిల్లాలో మండలి ఎన్నికల నేపథ్యంలో ఎవరైనా సరే చట్టాన్ని అధిగమిస్తే చర్యలు తప్పవు. పోలీసుశాఖ ఆదేశానుసారం ఎవరైనా కచ్చితంగా నిబంధనలు పాటించాల్సిందే. అలా కాకుండా నిబంధనలు అతిక్రమిస్తే కొరడా ఝుళిపిస్తాం. ఎన్నికల కోడ్ నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలి.

క్లుప్తంగా

బ్యాంకు ఉద్యోగి చేతివాటం
– రూ. 56.73 లక్షలు కాజేసిన వైనం

ఒంటిమిట్ట : మండల కేంద్రంలోని భారతీయ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో చిరుద్యోగిగా పని చేస్తున్న మండల పరిధిలోని నరవకాటిపల్లి పంచాయతీ, రైల్వే కాలనీకి చెందిన కాకి లక్ష్మీ నారాయణ(25) ఒకరి బ్యాంకు ఖాతాలో రూ. 56.73 లక్షల నగదును కాజేసినట్లు బుధవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ రామకృష్ణ ఫిర్యాదు చేశారు. సీఐ పురుషోత్తం రాజు కథనం మేరకు.. ఒంటిమిట్టకు చెందిన రెడ్డయ్య నాయుడు అనే వ్యక్తి తన ఎస్‌బీఐ బ్యాంకు ఖాతాలో అయిదు ఫిక్స్‌డ్ డిపాజిట్లు, నెలవారీ వేతనం కూడా నిల్వ చేస్తూ వచ్చాడు.దీనిని గమనించిన బ్యాంకు చిరుద్యోగి రెడ్డయ్య నాయుడు బ్యాంకు ఖాతాకు తన ఫోన్ నంబర్ లింకు పెట్టుకొని ఆరు నెలలుగా రెడ్డయ్య ఖాతా నుంచి నగదును బదిలీ చేస్తూ వచ్చాడు. ఓ రోజు రెడ్డయ్య బ్యాంకుకు వచ్చారు. తన ఖాతాలోని నిల్వ ఉన్న నగదులో తేడా వచ్చిన విషయం గమనించారు. ఈ నెల 13న బ్యాంకు అధికారులను ఆశ్రయించాడు. వారు విషయం తెలుసుకుని దీనిపై దృష్టి సారించి గోప్యంగా విచారణ కొనసాగించారు. వారి విచారణలో నేరం రుజువు కావడంతో బుధవారం ఎస్‌బీఐ రిజనల్ మేనేజర్ రామకృష్ణ స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నిందితుడు లక్ష్మీనారాయణను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ పురుషోత్తం రాజు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

వ్యక్తి మృతికి కారకుడైన నిందితుడికి జైలు

రాజంపేట : కడప–రేణిగుంట నేషనల్ హైవేలోని ఎర్రబల్లి గ్రామం వద్ద 2020లో ఫిబ్రవరి 26వతేదీన జరిగిన రోడ్డు ప్రమాదం కేసులో వీరబల్లి మండలం ఓదివీడుకు చెందిన మహమ్మద్ యూసఫ్ అనే వ్యక్తికి రెండేళ్ల జైలు, రూ.7వేలు జరిమానా విధిస్తూ రాజంపేట జుడిషయల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఎం.సంధ్యారాణి బుధవారం తీర్పు ఇచ్చారు. ఎస్‌ఐ భక్తవత్సలం కథనం మేరకు..మండలంలోని కొత్తబోయనపల్లెకు చెందిన మిరియం ఈశ్వరయ్యను ఏపీ39ఐడీ7126 నంబరు గల బొలారో వాహనంతో నిందితుడు మహమ్మద్ యూసఫ్ ఢీ కొట్టాడు.దీంతో ఆయన మృతి చెందాడు. ఈ ప్రమాదంపై పిండిబోయిన హరీష్ ఫిర్యాదు మేరకు రాజంపేట రూరల్ ఏఎస్‌ఐ సుబ్బయ్య కేసు నమోదు చేశారు. అప్పటి ఎస్‌ఐ హనుమంతు కేసును దర్యాప్తు చేశారు. కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. కేసుపూర్వపరాలను పరిశీలించిన జడ్జి తీర్పు ఇచ్చారు. ఈ కేసులో ప్రాసిక్యూసన్ తరఫున ఏపీపీ రహనే రసూల్ వాదించారు.ఈ విషయంపై ఏపీపీని, దర్యాప్తు అధికారులను, కోర్టు కానిస్టేబుల్ టీవీరమణలను జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు అభినందించారు.

అగ్నిప్రమాదం
– రూ.5లక్షలు నష్టం

లింగాల : వైఎస్సార్ జిల్లా లింగాల మండలం కర్ణపాపాయపల్లె గ్రామంలో అగ్ని ప్రమాదం సంభవించింది. గ్రామానికి చెందిన పుట్లూరు రామాంజనేయరెడ్డి అనే రైతుకు చెందిన 4ఎకరాల అరటి పంట కాలిపోయింది. గ్రామ సమీపంలోని కొండకు నిప్పు పెట్టడంతో మంటలు అరటి తోటలోకి వ్యాపించాయి. ప్రమాదంలో రూ.5లక్షల దాకా పంట నష్టం జరిగిందని ఆయన తెలిపారు.

పెయ్యదూడల ఉత్పత్తి..
పాడిరైతుకు సంపత్తి

1,38,132 ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని ఆవులు

4,57,507 గేదెలు



31 పథకం అమలయ్యే మండలాలు

3,100 లింగ నిర్ధారిత వీర్య డోసుల సరఫరా

536 ఇప్పటికే ఎద సూదులు వేసిన పశువులు

- లింగ నిర్ధారిత వీర్యం ద్వారా పెయ్యదూడల ఉత్పత్తి
- పాల దిగుబడుల పెంపే ధ్యేయం
- గత ఏడాది నవంబర్‌లో ప్రారంభమైన పథకం



పెయ్యి దూడల ఉత్పత్తి పథకం కింద పశువులకు లింగ నిర్ధారిత వీర్యంతో కూడిన ఎదు సూదులను వేస్తున్న పశు వైద్యాధికారి

వల్లూరు : లింగ వివక్షతను వీడండి..మహిళైనా, పురుషుడైనా ఒకటే అనే నినాదం మనుషుల వరకు పరవాలేదు.. కానీ పశువుల్లో ఆడ అయితేనే మేలు అనాల్సి వస్తోంది. ఎందుకంటే మనుషులు జీవనం సాగించడంలో భాగంగా ఆదాయార్జనే ధ్యేయంగా పశువులను పెంచుతున్నారు. ఒకప్పుడు పశువుల్లో దున్న, ఎద్దులను సేద్యాలకు ఉపయోగించే వారు. అందువల్ల పశువుల్లో మగ దూడల ఉత్పత్తి లాభసాటిగా ఉండేది.మారిన పరిస్థితుల్లో వాటితో సేద్యాలు చేసేవారి సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. ఈ క్రమంలో పశువుల్లో మగ దూడల ఉత్పత్తి లాభసాటిగా ఉండకపోవడంతో పశు పోషకులకు నిర్వహణ భారంగా మారుతోంది.దీంతో పాడి పరిశ్రమ ద్వారా అదనపు ఆదాయాన్ని సమకూర్చుకోవడానికి మొగ్గు చూపుతున్నారు. ఈ నేపథ్యంలో పశువుల్లో పెయ్య (ఆడ) దూడల ఉత్పత్తికి ప్రాధాన్యత ఇచ్చి పాల దిగుబడులను గణనీయంగా పెంచాలని, తద్వారా రైతులకు అదనపు ఆదాయాన్ని అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా నేటి లేగ దూడలే రేపటి పాడి పశువులు అనే నినాదంతో పెయ్య దూడల ఉత్పత్తి పథకానికి శ్రీకారం చుట్టింది.లింగ నిర్ధారిత వీర్యాన్ని ఉపయోగించడం ద్వారా రైతులకు కావాల్సిన పెయ్య దూడలను 90 శాతం ఖచ్చితత్వంతో పుట్టించడానికి చర్యలు చేపట్టింది. ఇందుకుగాను లింగ నిర్ధారిత వీర్యంతో కూడిన ఎద సూదులను సబ్సిడీపై అందుబాటులో ఉంచింది.

పైలెట్ ప్రాజెక్ట్ కింద 5 మండలాల్లో అమలు

పెయ్య దూడల ఉత్పత్తి పథకాన్ని 2017–18లో ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని 5 మండలాల్లో పైలెట్ ప్రాజెక్ట్ కింద అమలు చేశారు. సంబేపల్లె, చిన్నమండెం, సుండుపల్లె, వీరబల్లి, రాయచోటి మండలాల్లో అమలు చేసి పరిశీలించారు. గత ఏడాది నవంబర్ మాసం నుంచి ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని 31 మండలాల్లో ఈ పథకాన్ని పూర్తి స్థాయిలో ప్రారంభించారు. చింతకొమ్మదిన్నె, కమలాపురం, వల్లూరు, చక్రాయపేట, పోరుమామిళ్ల, కలసపాడు, కాశినాయన, బీ కోడూరు, బీ మఠం, అట్లూరు, చాపాడు, మైదుకూరు, దువ్వూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, యర్రగుంట్ల, వీరపునాయునిపల్లె, కొండాపురం, సుండుపల్లె, సంబేపల్లె, చిన్నమండెం, వీరబల్లి, లక్కిరెడ్డిపల్లె, రామాపురం, గాలివీడు, కోడూరు, రాయచోటి, చిట్వేలి, పెనగలూరు, రాజంపేట, నందలూరు మండలాల్లో పథకాన్ని ప్రారంభించారు.

అమలు ఇలా..

మేలైన పశు సంపద కలిగిన లింగ నిర్ధారిత వీర్యంపై ఆసక్తి ఉన్న పశు పోషకులను ఎంపిక చేస్తారు. వారి వద్ద ఉన్న పశువుల్లో ఇటీవల 60 నుంచి 90 రోజుల లోపు ఈనిన, 1 నుంచి 3 ఈతల మధ్య క్రమం తప్పకుండా ఎదకు వచ్చే గర్భకోశ వ్యాధులు లేని కట్టు శాతం ఎక్కువగా ఉండే పశువులను ఎంపిక చేస్తారు. సంబంధిత పశు పోషకులు, పశు వైద్యాధికారుల మధ్య ఒప్పందం జరుగుతుంది.తర్వాత సదరు పశువుకు లింగ నిర్ధారిత వీర్యంతో కూడిన ఎద సూదులను వేస్తారు.

ఖర్చు, రాయతీ

ఈ పథకం కింద ఒక్కో కృత్రిమ గర్భధారణకు ఒక్కొక్కటి రూ. 675 చొప్పున రెండు లింగ నిర్ధారిత వీర్య నాళికలను రూ 1350 లకు అందిస్తారు. ఇందులో ప్రభుత్వం రూ 850 రాయితీ పోను రైతు వాటా రూ. 500 చెల్లించాల్సి ఉంటుంది. ఒక వేళ రెండు పర్యాయాలు కృత్రిమ గర్భధారణ సూదులను వేసిన తర్వాత కూడా పశువు గర్భం దాల్చక పోతే రైతు చెల్లించిన మొత్తాన్ని తిరిగి ఇస్తారు. ఒక్కసారి మాత్రమే గర్భధారణ చేయించి రెండో సారి చేయించని వారికి డబ్బు చెల్లించరు. మొదటి సారి కృత్రిమ గర్భధారణ ద్వారా గర్భం దాల్చిన పశువు మగ దూడకు జన్మనిస్తే డబ్బు తిరిగి ఇవ్వరు. ఒక వేళ రెండో సారి గర్భ ధారణ తరువాత మగ దూడ పుట్టినట్లయితే రూ. 250 రైతుకు చెల్లిస్తారు.

అందుబాటులోని రకాలు

పశువుల్లో ముర్రా, జెర్సీ, హెచ్‌ఎఫ్ జెర్సీ, గిర్, సాహివాల్ మొదలైన జాతుల లింగ నిర్ధారిత వీర్య నాళికలు అందుబాటులో ఉన్నాయి. ఈ మేరకు పశువుల్లో ఎద లక్షణాలు గుర్తించడం, కృత్రిమ గర్భధారణ చేయించే సమయం మొదలైన యాజమాన్య పద్ధతులపై శిక్షణ పొందిన పశు వైద్య సిబ్బంది రైతులకు అవగాహన కల్పిస్తారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



జనాభాకు అనుగుణంగా ఆహార ఉత్పత్తులు పెరగాల్సిన అవసరం ఉంది. ఇందులో మంచి ఆహారంగా పేరు పొందిన పాల ఉత్తత్తి కూడా గణనీయంగా పెరగాల్సి ఉంది. ఈ నేపథ్యంలో లింగ నిర్ధారిత వీర్యంతో పశువుల్లో కృత్రిమ గర్భధారణ ప్రయోజనకరం. దీనివల్ల పెయ్య దూడల ఉత్పత్తి పెరిగి రెండు మూడేళ్లలో పాల దిగుబడులు గణనీయంగా పెరగడానికి దోహదపడుతుంది. దీనివల్ల దేశంలోఆహార అవసరాలను తీర్చడంతో పాటు రైతుల ఆదాయాన్ని మరింత పెంచడానికి ఉపయోగ పడుతుంది. పాడి రైతులు పెయ్య దూడల ఉత్పత్తి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ జీ రమేష్, డీఎల్‌డీఏ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, కడప

శభాష్ దస్తగిరి
– జాతీయస్థాయి టెన్నిస్ డబుల్స్‌లో ఛాంపియన్‌గా నిలిచిన హోంగార్డు

కడప అర్బన్(వైఎస్సార్‌జిల్లా) : జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో హోంగార్డుగా విధులను నిర్వహిస్తున్న ఎస్.కె. దస్తగిరి (హెచ్‌జీ 432) టెన్నిస్‌లో మరిన్ని విజయాలను సాధించాలని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆకాంక్షించారు. కడప నగరంలో ఈనెల 14 నుంచి 21 వరకు నిర్వహించిన ఆల్ ఇండియా సీనియర్ టెన్నిస్ పోటీల్లో 35 ప్లస్ డబుల్స్ విభాగంలో తన పార్టనర్ అరుణ్‌కుమార్ రెడ్డితో కలిసి ఛాంపియన్ షిప్ సాధించారు. ఈ నేపథ్యంలో బుధవారం స్థానిక పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్‌హాల్‌లో జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్, దస్తగిరిని ప్రత్యేకంగా అభినందించారు. మున్ముందు మరిన్ని విజయాలు సాధించాలని ఎస్పీ ఆకాంక్షించారు. దస్తగిరి మాట్లాడుతూ జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ప్రోత్సాహంతోనే తాను విజయాలు సాధించగలిగానని అన్నారు. ఈ కార్యక్రమంలో మైదుకూరు డీఎస్పీ ఎస్.ఆర్. వంశీదర్‌గౌడ్, ఆర్ఎస్ఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఏకసభ్య కమిషన్‌తో బోయలకు సమంజస న్యాయం



మాట్లాడుతున్న శామ్యూల్ ఆనంద్‌కుమార్

కడప సిటీ: ఏకసభ్య కమిషన్ ద్వారా బోయలు, వాల్మీకి సామాజిక వర్గ ప్రజలకు ఆమోదయోగ్యమైన, న్యాయబద్ధమైన రిజర్వేషన్ సదుపాయం లభిస్తుందన్న ఆశాభావాన్ని రాష్ట్ర ఏకసభ్య కమిషన్ చైర్మన్ శామ్యూల్ ఆనంద్‌కుమార్ వ్యక్తం చేశారు. బుధవారం వైఎస్సార్‌జిల్లా కడప కలెక్టరేట్‌లోని వీసీ హాలులో బోయ, వాల్మీకి సామాజిక వర్గాన్ని ఎస్టీల్లో చేర్చాలన్న అంశంపై అధ్యయనం చేసేందుకు ఆయన జిల్లా ఎస్సీ ఎస్టీ కార్పొరేషన్ల ఈడీ వెంకట సుబ్బయ్య, జిల్లా బీసీ సంక్షేమశాఖాధికారి బ్రహ్మయ్యలతో కలిసి సంబంధిత వర్గాల ప్రజల నుంచి అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కొన్నేళ్లుగా బోయలను ఎస్టీల్లో చేర్చాలన్న డిమాండును త్వరితగతిన పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అధ్యయనం చేసేందుకు ముందడుగు వేసిందన్నారు. అనంతరం ఈ సమావేశానికి హాజరైన పలువురు బోయలు తమను ఎస్టీల్లో చేర్చాలన్న వారి వారి అభిప్రాయాలను వెల్లడించారు. పలువురు ఏకసభ్య కమిషన్ చైర్మన్‌కు వినతిపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో బోయ, వాల్మీకి కమిషన్ డైరెక్టర్ లోమడ నారాయణస్వామి, కడప నగరానికి చెందిన విశ్రాంత ఎస్టీఓ వెంకట రమణ పాల్గొన్నారు.

విధులకు ఆటంకం కల్పించారని కేసు

కొండాపురం : వైఎస్సార్ జిల్లా లావనూరు గ్రామంలో ప్రభుత్వం భూమి అక్రమించారని ఆరోపణలు రావడంతో ఇన్‌చార్జి ఆర్ఐ అనంద్ పరిశీలించడానికి బుధవారం వచ్చారు. ఇతను విధులు నిర్వహిస్తుండగా అదే గ్రామానికి చెందిన వెన్నపూస ఈశ్వర్‌రెడ్డి, ఆతని భార్య ఆటంకం కలిగించారు. ఇన్‌చార్జి ఆర్ఐ ఫోన్ లాక్కొని పగులకొట్టారు.దీంతో ఆర్ఐ ఆనంద్ కొండాపురం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు వెన్నపూస ఈశ్వర్‌రెడ్డి అతని భార్యపై కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నామని కొండాపురం ఎస్ఐ సత్యనారాయణ తలిపారు.

లారీల ఢీ - డ్రైవర్ మృతి

గుంతకల్లు రూరల్ : రెండు లారీలు ఢీకొన్న ఘటనలో ఓ లారీ డ్రైవర్ మృతి చెందాడు. క్లీనర్ గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు... వైఎస్సార్ జిల్లా వేంపల్లె మండలం మోతుకూరు గ్రామానికి చెందిన హరిజన నాగరాజు (40), తొండూరు మండలం గోటూరు గ్రామానికి చెందిన రత్నరాజు బుధవారం ఉదయం గుంతకల్లు నుంచి గుత్తికి లారీ తీసుకుని బయలుదేరారు. పట్టణ శివారులోని పారిశ్రామిక వాడ వద్దకు చేరుకోగానే వేగాన్ని నియంత్రించుకోలేక ఎదురుగా వస్తున్న మరో లారీపైకి దూసుకెళ్లారు. ప్రమాదాన్ని పసిగట్టిన మరో లారీ డ్రైవర్ వెంటనే తన వాహనాన్ని పక్కకు తిప్పాడు. అదే సమయంలో నాగరాజు నడుపుతున్న లారీ ఎదురుగా ఉన్న లారీ వెనుకభాగాన్ని బలంగా ఢీకొంది. ఘటనలో డ్రైవర్ నాగరాజుతో పాటు క్లీనర్ రత్నరాజు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు వెంటనే 108 అంబులెన్స్ ద్వారా స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే నాగరాజు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. రత్నరాజుకు చికిత్స అందజేస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు గుంతకల్లు రూరల్ ఎస్ఐ సురేష్ తెలిపారు.

విద్యుదాఘాతంతో వృద్ధురాలు..

మైలవరం (జమ్మలమడుగు రూరల్) : విద్యుదాఘాతంతో బుధవారం మంచాల రమణమ్మ (66) అనే వృద్ధురాలు మృతి చెందింది. ఏఎస్ఐ ఆంజనేయులు కథనం మేరకు వైఎస్సార్ జిల్లా మైలవరం మండలం వేపరాల గ్రామానికి చెందిన మంచాల రమణమ్మ మధ్యాహ్నం సమయంలో వంట చేసెందుకు రైస్ కుక్కర్ ఆన్ చేసే సమయంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతి చెందినట్లు భర్త ఆంద్రూ మైలవరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

ఇద్దరు అంతర్‌రాష్ట్ర దొంగలు అరెస్ట్

- రూ. 4లక్షల విలువైన బంగారు ఆభరణాలు, రూ.20 వేలు నగదు స్వాధీనం
- జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్



బంగారు ఆభరణాలను పరిశీలిస్తున్న వైఎస్సార్ జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

కడప అర్బన్ : వైఎస్సార్ జిల్లా మైదుకూరు సబ్ డివిజన్ పరిధిలోని బి..మఠం మండలం నందిపల్లి క్రాస్ వద్ద ఇద్దరు అంతర్‌రాష్ట్ర దొంగలను ఈనెల 21వ తేదీన పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి గతంలో దొంగతనాలకు పాల్పడిన వివిధ కేసుల్లో రూ. 4లక్షల విలువైన బంగారు ఆభరణాలను, రూ. 20 వేలు నగదును స్వాధీనం చేసుకున్నారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని ×పెన్నార్₹ పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ విలేకరులకు వివరాలు వెల్లడించారు. అరెస్టయిన దొంగలలో గుంటూరు జిల్లా గోరంట్ల, అమరావతి రోడ్డులో నివాసం ఉంటున్న చిల్లర సురేష్, ఈతి అగ్రహారానికి చెందిన పైర్ల కిరణ్‌బాబు ఉన్నారు. వీరు 2019, 2020, 2023 సంవత్సరాలలో బి, మఠం మండలంలోని గంగిరెడ్డి పల్లె, నరసన్నపల్లె, లింగాలదిన్నె పల్లె గ్రామాల్లో దొంగతనాలకు పాల్పడినట్లు ఒప్పుకున్నారు.నిందితుల నుంచి సుమారు రూ. 4లక్షల విలువైన బంగారు ఆభరణాలు, రూ. 20 వేలు నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇంకా వీరు గుంటూరులోని అట్టికా గోల్డ్ సంస్థలో 125 గ్రాముల బంగారు ఆభరణాలను విక్రయించారు. పెదనందిపాడులోని ముత్తూట్ ఫైనాన్స్‌లో 30 గ్రాముల బంగారు ఆభరణాలను తాకట్టు పెట్టారు. ఆయా సంస్థల వారికి నోటీసులు పంపించామని ఎస్పీ తెలిపారు. అరెస్టయిన ఇద్దరు అంధ్రా, తెలంగాణా రాష్ట్రాలలో సుమారు 73 కేసుల్లో నిందితులుగా ఉన్నారు. 16 కేసుల్లో శిక్ష అనుభవించారు. ఇంకా 9 కేసుల్లో వీరిపై వివిధ కోర్టులలో విచారణ ఎదుర్కొంటున్నారు. మిగిలిన కేసులు కొట్టివేశారు.దొంగతనాల కేసులో వీరితో పాటు మరో ఇద్దరు కూడా ఉన్నారు.వారి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్పీ అన్బురాజన్ తెలిపారు. నిందితులను అరెస్ట్ చేయడంలో కృషి చేసిన మైదుకూరు డీఎస్పీ వంశీధర్‌గౌడ్, మైదుకూరు రూరల్ సీఐ నరేంద్రారెడ్డి, బి.మఠం ఎస్ఐ విద్యాసాగర్, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. వీరిలో కొందరికి ప్రశంసాపత్రాలు, నగదు రివార్డులను ఎస్పీ చేతుల మీదుగా అందజేశారు.

బావిలో పడి మతిస్థిమితం లేని వ్యక్తి మృతి



హరిబాబు మృతదేహం

మదనపల్లె : బావిలో పడి మతిస్థిమితం లేని వ్యక్తి మృతిచెందిన సంఘటన బుధవారం మదనపల్లె మండలంలో జరిగింది. తాలూకా పోలీసుల కథనం మేరకు.. మండలంలోని చీకలబైలు పంచాయతీ జమ్మికుంటపల్లెకు చెందిన జి.హరిబాబు(35) కొన్నేళ్లుగా మతిస్థిమితం లేక అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కుటుంబసభ్యులు బెంగళూరు, తిరుపతి తదితర ప్రాంతాల్లో చికిత్సలు అందించారు. మతిస్థిమితం లేని కారణంగా భార్య కళావతి ఇతన్ని వదలి వెళ్లిపోయింది. ఈ క్రమంలో బుధవారం ఉదయం తనకు సమయానికి అన్నం పెట్టలేదని హరిబాబు ఇంట్లోవారితో గొడవపడ్డాడు. అనంతరం ఇంట్లో నుంచి అలిగి వెళ్లిపోయి గ్రామసమీపంలోని ఓ బావిలో ప్రమాదవశాత్తు పడిపోయి మృతిచెందాడు. కాగా బావిలో మృతదేహం తేలిఉండడాన్ని స్థానికులు గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. వారు ఘటనాస్థలానికి వెళ్లి బోరున విలపించారు. తాలూకా పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని స్థానికుల సాయంతో మృతదేహాన్ని బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల జిల్లా అధ్యక్షులు వీరే!

సాక్షి ప్రతినిధి, కడప : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షుల నియామకాలు బుధవారం జరిగాయి. వివరాలను పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటించింది. కాగా, జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు పార్టీ ప్రతిష్టతకు కృషి చేయాలని, పార్టీ ఎల్ల వేళలా వారికి అండగా నిలుస్తుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సూచించినట్టు పార్టీ అనుబంధ విభాగాల రాష్ట్ర కో–ఆర్డినేటర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి వెల్లడించారు. బాధ్యతలు స్వీకరించనున్న నాయకులకు ఆయన అభినందనలు తెలియజేశారు.

విభాగం	జిల్లా అధ్యక్షుడి పేరు	ప్రాంతం
యూత్	ఆర్.సమరసింహారెడ్డి	రాయచోటి
మహిళ	మహితా ఆనంద్	పీలేరు
రైతు	పి.ఆనంద్‌రెడ్డి	పీలేరు
బీసీ	మోడెం నాగభూషణం	రాజంపేట
ఎస్సీ	ఎం.రవీంద్ర	పీలేరు
ఎస్టీ	బి.శ్రీనివాస్ నాయక్	తంబళ్లపల్లె
మైనార్టీ	బేపారి మహమ్మద్ ఖాన్	రాయచోటి
వైఎస్సార్ టీయూసీ	సి.చిన్న ఎల్లప్ప	పీలేరు
చేనేత	బొడ్డిచెర్ల శివయ్య	రాజంపేట
పంచాయతీరాజ్	హబీబ్ బాషా	పీలేరు
పబ్లిసిటీ	శిబ్యాల విజయభాస్కర్	రాయచోటి
వికలాంగుల	సి.రెడ్డెప్ప	పీలేరు
వైఎస్సార్ సేవాదళ్	సి.పునీత్‌రెడ్డి	మదనపల్లె
డాక్టర్స్	డాక్టర్ ఐ.అనిల్‌కుమార్‌రెడ్డి	మదనపల్లె
సాహిత్య	ఎస్.సుధాకర్ రెడ్డి	తంబళ్లపల్లె
వాణిజ్య	ఎస్.నవీన్ కుమార్‌రెడ్డి	రాజంపేట
క్రైస్తవ మైనార్టీ	ఇ.చంద్రమోహన్	రాజంపేట
విద్యార్థి	జె.కిషోర్‌కుమార్ రెడ్డి	రాయచోటి

వెలిగల్లు, మల్లయ్యకొండపై టూరిజం రిసార్ట్‌లు

పర్యాటకశాఖ ఆర్‌డీ రమణప్రసాద్



హార్సిలీహిల్స్‌పై అడ్వంచర్స్ స్పోర్ట్స్‌ను పరిశీలిస్తున్న ఆర్‌డీ, డీటీఓ

బి.కొత్తకోట : జిల్లాలోని వెలిగల్లు ప్రాజెక్టు వద్ద రిసార్ట్, ప్రాజెక్టులో బోటింగ్, తంబళ్లపల్లె సమీపంలోని మల్లయ్యకొండపై రిసార్ట్‌ల నిర్మాణం కోసం అధ్యయనం చేసినట్లు పర్యాటకశాఖ రీజనల్ డైరెక్టర్ (తిరుపతి) డాక్టర్ రమణప్రసాద్ చెప్పారు. బుధవారం ఆయన అన్నమయ్యజిల్లా పర్యాటక అధికారి ఎం.నాగభూషణంతో కలిసి బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై పర్యటించారు. కొండపై పర్యాటకశాఖ పరిధిలోని 40 ఎకరాల భూమికి జియో ట్యాగింగ్ చేసి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. భవనాలు, ఖాళీస్థలాల వివరాలను పొందుపరిచారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ వెల్లిగల్లు, మల్లయ్యకొండపై టూరిజం కార్యకలాపాలను ప్రారంభించేందువకు ప్రభుత్వం చొరవ చూపుతోందని అన్నారు. మల్లయ్యకొండపై రిసార్ట్, వ్యూపాయింట్, అడ్వెంచర్స్ స్పోర్ట్స్ నిర్మాణం కోసం కన్సల్టెంటింగ్ సంస్థ అధ్యనం చేసిన నివేదిక అందాక నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపనున్నట్లు చెప్పారు. తిరుపతిలో విద్యాసంస్థల్లో చదువుకొంటున్న విద్యార్థులతో 2,500 యువ టూరిజం క్లబ్స్ ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ క్లబ్స్ ఏర్పాటు ద్వారా విద్యార్థుల సంస్కృతి,సంప్రదాయాల గురించి తెలుసుకోవడమే కాక పర్యాటక, ఆధ్యాత్మిక ప్రాంతాలపై అవగాహన పెంచుకొంటారని చెప్పారు. హార్సిలీహిల్స్‌పై అడ్వంచర్స్ స్పోర్ట్స్ అభివృద్ధి కోసం ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న దానిపై పరిశీలించామన్నారు. అనంతరం వీరు అతిథి గృహాలు, రెస్టారెంట్‌ను తనిఖీ చేసి సిబ్బంది పనితీరు, అతిథులకు అందిస్తున్న సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

వాల్మీకిపురం : మండలంలోని చింతపర్తి సమీపంలో విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకొంది.

వివరాలు.. వాల్మీకిపురం మండలం జర్రావారిపల్లి పంచాయతీ వడ్డిపల్లికి చెందిన బండి రమణయ్య (58) 20 ఏళ్ల కిందట సోమల మండలం కందూరు పంచాయతీ ఉలవలకుంటకు వలస వెళ్లి అక్క నివాసం ఉంటున్నాడు. ఇటీవల సొంత పనుల నిమిత్తం స్వగ్రామమైన వడ్డిపల్లికి వచ్చి మంగళవారం రాత్రి ఉలవలపల్లికి బయలుదేరాడు. ఈ మధ్య ఏమి జరిగిందో తెలియదుకాని చింతపర్తి వద్ద రమణయ్య బుధవారం ఉదయం శవమై కనిపించాడు. ఏదైనా వాహనం ఢీకొని మృతి చెందాడా లేక ఎవరైనా దాడి చేసి చంపారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కడుపునొప్పి తాళలేక ఆత్మహత్య

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక మోడంపల్లెలో కడుపునొప్పి తాళలేక మనీషా (28) అనే వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం మేరకు మోడంపల్లెకు చెందిన రామ్మోహన్‌రెడ్డికి నాలుగేళ్ల క్రితం మనీషాతో వివాహమైంది. వారికి రెండేళ్ల కుమార్తె ఉంది. అతను ఎలక్ట్రీషియన్ పని చేస్తుంటాడు. కొన్ని రోజుల నుంచి మనీషాకు కడుపునొప్పి ఉండేది. ఆస్పత్రిలో చూపించినా నయం కాలేదు. దీంతో ఆమె బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుంది. ఆమె తండ్రి తిమ్మారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ ఇబ్రహీం తెలిపారు.

అప్పుల బాధతో..

ములకలచెరువు : అప్పుల బాధతో డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఏఎస్ఐ నజీర్‌బాషా కథనం మేరకు... సత్యసాయి జిల్లా నల్లచెరువు మండలం దామవాండ్లపల్లెకు చెందిన అశోక్(34) స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులోని టమాట మండీలో నాలుగేళ్లుగా లారీ డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇతనికి భార్య సుమిత్ర, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. శివరాత్రి పండుగకు భార్య, కుమార్తెలు పుట్టింటికి వెళ్లారు. గతంలో చేసిన అప్పులు తీర్చలేక మనోవేదన చెందాడు. బాడుగ ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకొని అశోక్ ఆత్మహత్య చేసుకున్నాడు. పక్కంటి వాళ్లు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని సుమిత్రకు సమాచారం అందించారు. అపుల బాధతోనే ఆత్మహత్య చేసుకున్నట్లు భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ చెప్పారు.